

## ప్రభుత్వ హాస్పిటల్ సమస్యలు పరిష్కారం చేయండి

5 లో

కెరటం న్యూస్
( సామాన్యుడి ఆయుధం )
ఆదివారం 09, జూన్ 2024
తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ గుర్తింపు పొందిన మీడియా సంస్థ

# మొదటి విడతలో ఇళ్లు.... రెండో విడతలో ఇళ్ల స్థలాలు

- తెలంగాణ రెవెన్యూ, గృహ నిర్మాణం, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి
- కూసుమంచి మండలంలో పర్యటన
- ప్రజల నుంచి వినతుల స్వీకరణ



**ఖమ్మం బ్యూరో, కెరటం న్యూస్**

అర్హులైన పేదలందరికీ మొదటి విడతలో ఇళ్లు....రెండో విడతలో ఇళ్ల స్థలాలు ఇస్తామని తెలంగాణ రెవెన్యూ, గృహ నిర్మాణం, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి పేర్కొన్నారు. కూసుమంచి మిగతా 2లో..



## ఆరోగ్యశ్రీలో అదనంగా 65 కొత్త చికిత్స విధానాలు అమలు

- 1375 పాత చికిత్స విధానాలకు నగదు ప్యాకేజీ పెంపు
- వీటికి గాను రూ. 487 కోట్లు విడుదల చేసిన డిప్యూటీ సీఎం భట్టి

4 లో

## మీడియా దిగ్గజం... ఈనాడు గ్రూపు సంస్థల చైర్మన్, పద్మవిభూషణ్ చెరుకూరి రామోజీరావు అకాల అస్తమయం



- రామోజీరావు మృతి పట్ల పలువురి సంతాపం

లోపలి పేజీలో..

## మధిర కోర్టులో జరిగిన మెగా లోకదాలత్‌లో

# 931 కేసుల పరిష్కారం..

**మధిర కెరట న్యూస్ ప్రతినిధి :**

శనివారం మధిర కోర్టులో ప్రధాన న్యాయమూర్తి శ్రీ టి. కార్తీక్ రెడ్డి అధ్యక్షతన మెగా లోక్ అదాలత్ జరిగింది.ప్రధాన జూనియర్ సివిల్ జడ్జి కోర్టులో ఎక్సైజ్ కేసులతో సహా 174 కేసులుపరిష్కారం కాగా 1,06,370 రూపాయలు జరిమానా విధించారు . అదనపు జూనియర్ సివిల్ జడ్జి కోర్టులో మిగతా 2లో..



# మొదటి విడతలో ఇళ్లు.... రెండో విడతలో ఇళ్ల స్థలాలు

(మొదటిపేజీ తరువాయి..)

మండల పర్యటనలో భాగంగా నాయకన్ గూడెం, భగత్ వీడుతండా, మంగళి తండా, ఈశ్వర మదారం, రాజుపేట బజార్, రాజు పేట, గోరిలపాడు తండా, హిరామాన్ తండా, పెరిక సింగారం, జక్కేపల్లి, జక్కేపల్లి ఎస్సీ కాలనీ, మల్లేపల్లి, గట్టు సింగారం, గంగబండ తండా, లింగారం తండా, కోక్యా తండా, లోక్యా తండా, నేలపట్ల, అగ్రహారం, మునిగేపల్లి గ్రామాలను సందర్శించారు. ప్రజల నుంచి వినతులను స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లో ఏర్పాటు చేసిన కార్యక్రమాల్లో మంత్రి పొంగులేటి మాట్లాడుతూ.... ఖమ్మం పార్లమెంట్ ఎన్నికలు జరిగిన ఇన్ని సంవత్సరాల్లో ఏ సభ్యుడికి రాని మెజారిటీ రఘురాం రెడ్డి కి వచ్చిందన్నారు. అసెంబ్లీ ఎన్నికల సమయంలో తాను ఇచ్చిన హామీలన్నీ పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. గడిచిన పది సంవత్సరాల్లో అధికారంలో ఉన్న బీఆర్ఎస్ రేషన్ కార్డు,ఇళ్లు ఇవ్వలేదని విమర్శించారు. పాలేరు తన సొంత ఇళ్లు కాబట్టి అక్కడి ప్రజలు ఇచ్చిన పదవితో వారందరి కోరికలు తీరుస్తానన్నారు. రాబోయే మూడు సంవత్సరాల్లోపే పాలేరులోని అర్హులైన పేదలందరికీ ఇళ్లు ఇప్పిస్తానని స్పష్టం చేశారు. అతి కొద్ది రోజుల్లోనే అర్హులైన వారందరికీ తీపి కబురు అందుతుందని తెలిపారు. ఉచిత కరెంటు కోసం అర్హులైన వారందరూ దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. గ్రామంలో ఉన్న ప్రభుత్వ భూములను వెలికి తీసి వాటిలో పేదలకు ఇళ్ల నిర్మాణం చేస్తామని తెలిపారు. ప్రతి గ్రామంలో సీసీ రోడ్లు, డ్రైనేజీలు నిర్మాణం చేయిస్తామని పేర్కొన్నారు. ఈ పర్యటనలో మంత్రి తో పాటు ఎంపీపీ, వైస్ ఎంపీపీ, జెడ్పీటీసీలు, ఎంపీటీసీలు, సర్పంచులు, ఇతర ప్రజా ప్రతినిధులు, స్థానిక నాయకులు, కార్యకర్తలు, అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

## మధిర కోర్టులో జరిగిన మెగా లోకదాలత్‌లో

# 931 కేసుల పరిష్కారం..

(మొదటిపేజీ తరువాయి..)

76 కేసులు పరిష్కారం కాగా 1,02 ,100 రూపాయలు జరిమానా విధించారు .ద్వితీయ శ్రేణి న్యాయమూర్తి కోర్టు లో 681 కేసులు పరిష్కారం కాగా 35,700 రూపాయలు జరిమానా విధించారు. ఈ సందర్భంగా జరిగిన న్యాయ చైతన్య సదస్సులో ప్రధాన న్యాయమూర్తి శ్రీ టీ కార్తీక్ రెడ్డి మాట్లాడుతూ కక్షిదార్లు సంయమనం పాటించి సాధ్యమైనంత వరకు పట్టుదలకు పోకుండా కేసులు పరిష్కారానికి చొరవ చూపాలని వ్యాఖ్యానించారు ఈ కార్యక్రమంలో ద్వితియ శ్రేణి న్యాయమూర్తి శ్రీ ఎం అబ్రహం ,కోర్టు పబ్లిక్ ప్రాసిక్యూటర్స్ ఎన్ .నాగలక్ష్మి ,జె .భద్రయ్య బార్ అధ్యక్షులు బి .పుల్లారావు సీనియర్ న్యాయవాదులు వాసంశెట్టి కోటేశ్వరరావు,చింతల గోపాల్,ఎన్. జనార్ధన్ రావు ,పల్ల పోతుల కృష్ణారావు , టీ.వెంకట్రావు ,కె.విజయ్ కుమార్ ,ఎంసతీష్ ,జే. రమేష్, శ్రీనివాస్ తదితరులు పాల్గొనగా ఎక్సైజ్ అధికారులు ,పోలీస్ సిబ్బంది ,కోర్టు సిబ్బంది పాల్గొన్నారు. లోకదాలత్ దిగ్విజయానికి సహకరించినందుకు పోలీసు అధికారులు, న్యాయవాదులు, కోర్టు సిబ్బంది యస్. దివి, బి. హనీషా, ఉపేందర్ లను న్యాయమూర్తి అభినందించారు.

## రామోజీరావు మృతి సమాజానికి తీరని లోటు : నామ నాగేశ్వరరావు

**ఖమ్మం బ్యూరో, కెరటం న్యూస్:** మీడియా దిగ్గజం ...ఈనాడు గ్రూపు సంస్థల చైర్మన్, పద్మవిభూషణ్ చెరుకూరి రామోజీరావు అకాల అస్తమయం పట్ల ఖమ్మం మాజీ పార్లమెంట్ సభ్యులు నామ నాగేశ్వరరావు శనివారం ఒక ప్రకటనలో తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఆయన ఆకస్మిక మరణం తనను తీవ్రంగా కలచివేసిందని సంతాపం తెలిపారు..తను నమ్మిన విలువలు, సిద్ధాంతం కోసం మీడియా ప్రపంచంలో ఆయన సాగించిన ప్రయాణం అసామాన్యమైందని పేర్కొన్నారు. ఆయన మృతి మీడియా ప్రపంచానికి, సమాజానికి తీరని లోటని పేర్కొంటూ ఆయన పవిత్రాత్మకు శాంతి కలగాలని దైవాన్ని



ప్రార్థించారు. ఆయన మన మధ్య సజీవంగా లేకున్నా ఆయన స్థాపించిన సంస్థల రూపంలో నిత్యం మన కళ్ళ ముందే ఉంటారని అన్నారు. సామాజిక సేవ ద్వారా సమాజంలో చైతన్యం తీసుకువచ్చిన నిత్య కృషి వలుడని తెలిపారు.అక్షర యోధునిగానే కాకుండా సినీ నిర్మాతగా, అంతర్జాతీయ ప్రమాణాలతో కూడిన సినీ స్టూడియో నిర్మాణం , వాణిజ్య వేత్తగా ఆయన సాధించిన విజయాలు అందరికీ స్ఫూర్తినీయమని నామ కొనియాడారు. నైతిక విలువలు, ప్రమాణాలతో పాత్రికేయునిగా మిన్నగా రాణించారని చెప్పారు. నిరంతర శ్రమ, కార్యదీక్ష, నిబద్ధతకు నిలువెత్తు నిదర్శనమే రామోజీరావు అని నివాలర్పించారు. వారి కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతిని తెలిపారు.

## దుమ్ముగూడెంలో దొంగల బీభత్సం

- ఐదు లక్షల విలువ గల బంగారం, 52,000 నగదు చోరీ

**కెరటం న్యూస్ ప్రతినిధి దుమ్ముగూడెం :** దుమ్ముగూడెం లో దొంగలు బీభత్సానికి పాల్పడ్డారు దుమ్ముగూడెం గ్రామానికి చెందిన బైరెడ్డి భాను కిరణ్ దంపతులు వ్యక్తిగత పనిమీద గత రెండు రోజుల క్రితం హైదరాబాదుకు వెళ్ళగా ఇది గమనించిన దొంగలు భాను కిరణ్ ఇంట్లో 5 లక్షల రూపాయల విలువ గల బంగారం 52 వేల రూపాయల నగదు కాజేశారు. శనివారం ఉదయం భాను కిరణ్ స్నేహితులు ద్విచక్ర వాహనానికని భాను కిరణ్ ఇంటికి వచ్చిన సందర్భంలో ఇంటి తలుపు తాళం కప్ప పగలగొట్టి ఉండడం లోపల బీరువా తలుపులు పగలగొట్టి ఉండడంతో వెంటనే చుట్టుపక్కన వాళ్లకి తెలపడంతో లోపలికి వెళ్లి పరిశీలించగా దొంగతనం జరిగిందని గుర్తించారు వెంటనే ఈ సమాచారం భాను కిరణ్ దంపతులకు తెలియజేయగా బీరువాలో ఐదు లక్షల రూపాయలు విలువగల బంగారు నగలు 52,000 నగదు దాచి ఉంచినట్లు వారు తెలిపారు కాగా భాను కిరణ్ కి ఇటీవలే పెద్ద నల్లబల్లి గ్రామపంచాయతీ మాజీ సర్పంచ్ మట్ట వెంకటేశ్వరరావు(శివాజీ) కుమార్తెతో వివాహం జరగగా ఈ వివాహం సందర్భంగా నూతన వధూవరులకు ఈ బంగారం కొనుగోలు చేసినట్లు తెలిసింది భాను కిరణ్ ఇంట్లో సుమారు 10 లక్షల రూపాయల విలువగల బంగారు నగలు ఉండగా గత కొద్ది రోజుల క్రితమే భాను కిరణ్ అత్తమామలైన మట్ట వెంకటేశ్వరరావు దంపతులు కొంత బంగారాన్ని కావాలని కోరడంతో మట్ట వెంకటేశ్వరరావు కుమార్తె తన పుట్టింటికి తీసుకువెళ్లి ఇచ్చినట్లు తెలిసింది ఆ బంగారం కూడా ఉంటే మొత్తం 10 లక్షల విలువగల బంగారం నగలు దొంగల స్వాహా కి గురయ్యేవి కుటుంబీకులు వాపోయారు దుమ్ముగూడెం లో భారీ స్థాయిలో జరిగిన దొంగతనం గురించి తెలుసుకున్న దుమ్ముగూడెం సీఐ అశోక్ దుమ్ముగూడెం లో చోరీకి గురైన ఇంటి పరిసర ప్రాంతాలను పరిశీలించారు చుట్టుపక్కల వాళ్ళను పలు వివరాలు అడిగి తెలుసుకున్నారు ఈ చోరీపై దుమ్ముగూడెం పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు

## రామోజీరావు మృతికి సిపిఎం జిల్లా కమిటి సంతాపం

**ఖమ్మం టౌన్, కెరటం న్యూస్:** ప్రముఖ పత్రికా సంపాదకుడు చెరుకూరి రామోజీరావు మరణం పట్ల సిపిఎం జిల్లా కమిటి సంతాపం, కుటుంబానికి సానుభూతి తెలియజేస్తుందనిసిపిఎం జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు ఒక ప్రకటనలో తెలియ చేశారు. రామోజీరావు మొదట కమ్యూనిస్టు ఉద్యమంలో యువజన రంగంలో కార్యకర్తగా పనిచేశారని, సుందరయ్య, చండ్ర రాజేశ్వరరావుల సహచర్యంలో పనిచేశారని గుర్తు చేశారు. తర్వాత వ్యాపార రంగంలోకి వెళ్ళిన రామోజీరావు ప్రధానంగా పత్రికా రంగంలో పనిచేసి జర్నలిజంలో సంచలనాలు సృష్టించారని తెలిపారు. ఉమ్మడి రాష్ట్రంలో సారా వ్యతిరేక ఉద్యమంలో మద్ధతుగా పాల్గొని మద్యపాన నిషేధం కోసం ఎనలేని కృషి చేశారని అన్నారు. అదే విధంగా మాతృభాషను కాపాడటం కోసం కృషి చేశారని గుర్తు చేశారు. పత్రికా రంగమైనా, ఎలక్ట్రానిక్ మీడియా అయినా అవినీతి మీద ఎనలేని పోరాటం చేశారని గుర్తు చేశారు. అక్షరానికి సామాజిక బాధ్యత వుందని తన పత్రిక “ఈనాడు” ద్వారా రామోజీ నిరూపించారని తెలిపారు. ప్రజా పక్షం వహిస్తూ, వాస్తవాలు వెల్లడిస్తూ, జన చ్కైతన్యం కలిగించాలరి, ప్రజల ఉద్యమాలకు అండగా నిలిచారని, విలువలు కలిగిన జర్నలిజాన్ని అందించి ఇతరులకు మార్గదర్శిగా వున్నారని అన్నారు. తెలుగువారు గర్వపడేలా హైద్రాబాద్‌లో అద్భుతమైన “ రామోజీ ఫిలిం సిటీ ” ని నిర్మించారని తెలిపారు. రామోజీరావు దేశానికి, రాష్ట్రానికి, పత్రికా రంగానికి చేసిన సేవలు శ్లాఘనీయమన్నారు.


# రామోజీరావు మృతికి డీసీసీ అధ్యక్షులు పువ్వాళ్ల సంతాపం

**ఖమ్మం బ్యూరో, కెరటం న్యూస్:** తెలుగు పత్రికా దిగ్గజం, ఈనాడు గ్రూప్స్ అధినేత, పద్మవిభూషణ్ గ్రహీత చెరుకూరి రామోజీరావు మరణం పట్ల జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు పువ్వాళ్ళ దుర్గాప్రసాద్ తీవ్ర దిగ్భ్రాంతిని వ్యక్తం చేశారు. ఆయన మరణం తెలుగు పత్రికా, మీడియా, వ్యాపార రంగాలకు తీరని లోటని అన్నారు. తెలుగు జర్నలిజానికి విశ్వసనీయతను, తెలుగు మీడియా రంగానికి కొత్త పంథాను నేర్పిన ఘనత రామోజీరావుకి దక్కుతుందని ఒక సందేశంలో పేర్కొన్నారు. రామోజీరావు



తెలుగువారి కీర్తిని దేశ స్థాయిలో చాటిన వ్యక్తిగా జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు పువ్వాళ్ళ దుర్గాప్రసాద్ కొనియాడారు. రంగం ఏదైనా విలువలకు, విశ్వసనీయతకు పెద్దపీట వేసిన వ్యక్తి రామోజీరావు అన్నారు. పత్రిక నిర్వహణ ఒక సవాల్ అనుకునే పరిస్థితుల్లో ఐదు దశాబ్దాల పాటు ఈనాడు పత్రికను నెంబర్ వన్ స్థానంలో నడపడం, ఈటీవీ స్థాపనతో టీవీ మీడియా రంగానికి దశాదిశా చూపిన దార్శనికుడు రామోజీరావు గారు అని అన్నారు. అక్షర వీరుడు రామోజీరావు ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుడ్ని ప్రార్థిస్తూ... ఆయన కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.

## రామోజీరావు మృతికి టీఎన్జీఓస్ సంతాపం



**ఖమ్మం టౌన్, కెరటం న్యూస్ :** ఈనాడు సంస్థల చైర్మన్ పత్రికా మీడియా రంగంలో తనదైన ముద్ర వేసుకొని తెలుగు మీడియా రంగాన్ని ప్రపంచవ్యాప్తం చేసిన దార్శనికుడు సినీ టీవీ రంగాల్లో ప్రపంచ సాయి టెక్నాలజీని అందించి చలనచిత్ర రంగానికి గొప్ప స్టూడియోను అందించిన గొప్ప విజనరీ అని టీఎన్జీఓస్ ఖమ్మం జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్ వీ ఎస్ సాగర్, రాష్ట్ర ఉపాధ్యక్షులు నందగిరి శ్రీను, టీఎన్జీవో జిల్లా ఉపాధ్యక్షులు ఎండి మజీద్ తదితరులు అన్నారు. రామోజీ ఏ రంగాల్లో అయినా క్రమశిక్షణ గల నాయకుడిగా ఎంతోమంది నిరుద్యోగులకు ఉద్యోగాలు కల్పించి తెలుగు వారి ఖ్యాతిని ప్రపంచ దేశాల్లో నిలిపిన అభినవ వైతాళికుడు అన్నారు. చెరుకూరి రామోజీ రావు అకాల మరణం తెలుగు వారికి తీరని లోటు వారి అకాల మరణానికి చింతిస్తూ కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తూ ఖమ్మం జిల్లా టీఎన్జీవో శాఖ పక్షాన ప్రగాఢ సానుభూతి తెలియజేస్తూ శ్రద్ధాంజలి ఘటిస్తున్నామని ఖమ్మం జిల్లా కార్యదర్శి ఆర్ వి ఎస్ సాగర్, రాష్ట్ర ఉపాధ్యక్షులు నందగిరి శ్రీను, టీఎన్జీవో జిల్లా ఉపాధ్యక్షులు ఎండి మజీద్, జి ఎస్ ప్రసాద్ రాష్ట్ర కార్యదర్శి, ఖమ్మం జిల్లా టీఎన్జీవో శాఖ మరియు మహిళా విభాగము, టీఎన్జీవో నగర శాఖ అధ్యక్షులు ఎస్ కే మీరా కట్టా నవీన్ జిల్లా కోశాధికారి భాగం పవన్ నీరుకొండ చంద్రశేఖర రావు ఎన్జీవో జిల్లా అసోసియేట్ అధ్యక్షులు వీరనారాయణ సైదులు పకూరపాటి శ్రీను, కిరణ్ కుమార్, మహిళా విభాగ అధ్యక్షులు, జ్యోతి కార్యదర్శి స్వప్న వైరా యూనిట్ అధ్యక్షురాలు శివస్వప్న కల్లూరు యూనిట్ అధ్యక్షులు సవర్జెన్ పాల్ రఘునాథపాలెం అధ్యక్షులు సాయి శిరనమయీ, బుద్ధ రామకృష్ణ ఫిరంగి శ్రీను తదితరులు ఉన్నారు.

# ఎమ్మెల్సీ ఎన్నికల్లో తీన్మార్ మల్లన్న గెలుపుపై ఆనందం వ్యక్తం చేసిన కాంగ్రెస్ పార్టీ నాయకులు

**మధిర కెరటం న్యూస్ ప్రతినిధి :** మధిర పట్టణంలో కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో మధిర మండల, పట్టణ కాంగ్రెస్ నాయకులు వరంగల్- ఖమ్మం- నల్గొండ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో తీన్మార్ మల్లన్న గెలుపు పట్ల సంబరాలు జరుపు కొని టపాసులు కాల్చి స్వీట్లు పంచిపెట్టారు. ఈ సందర్భంగా మధిర మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు సూరం శెట్టి కిషోర్ మాట్లాడుతూ ఎంతో ప్రతిష్టాత్మకంగా జరిగినటువంటి ఎమ్మెల్సీ ఎన్నికల్లో మిత్రపక్షాలు బలపరిచిన కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి తీన్మార్ మల్లన్న గెలుపొందడం చాలా ఆనందంగా ఉంది అన్నారు. తీన్మార్ మల్లన్న విజయంలో ప్రతి ఒక్కరి భాగస్వామ్యం ఉందన్నారు. అందరి సమిష్టి కృషి, సహకారం తోనే మల్లన్నకు ఈ విజయం దక్కిందన్నారు. కాంగ్రెస్ పార్టీ ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తల క్షేత్రస్థాయి ప్రచారంతో తీన్మార్ మల్లన్న గెలుపు కోసం ఎంతో శ్రమించారన్నారు. పట్టభద్రుల, నిరుద్యోగుల ఆశయాలు, అవసరాలకు అనుగుణంగా మల్లన్న పనిచేస్తారని చెప్పారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి



వచ్చిన వెంటనే నిరుద్యోగులకు 30,000 ఉద్యోగాలు ఇచ్చి గౌరవించిందన్నారు, కాంగ్రెస్ పార్టీ ప్రవేశపెట్టిన ఆరు గ్యారెంటీ పథకాలు కాంగ్రెస్ పార్టీని ప్రజలకు చేరువ చేశాయని అన్నారు.ఎమ్మెల్సీ ఎన్నికల్లో ప్రతి ఇంటికి తిరిగి ఓట్లు వేయించిన కాంగ్రెస్ నాయకులకు కార్యకర్తలకు ధన్యవాదాలు తెలియజేశారు.రాబోయే ఎంపీటీసీ, జడ్పిటిసి, గ్రామపంచాయతీ ఎన్నికల్లో కాంగ్రెస్ కార్యకర్తలు కష్టపడి పనిచేసి పార్టీ సూచించిన అభ్యర్థులను గెలిపించాలన్నారు. ఈ కార్యక్రమంలో మధిర మండల ఎస్సీ సెల్ అధ్యక్షుడు దారా బాలరాజు, సేవాదళ్ అధ్యక్షుడు ఆదూరి శ్రీనివాస్, మండల ఎస్టీ సెల్ అధ్యక్షుడు బాణావత్ వెంకటరమణ నాయక్, మాజీ సర్పంచ్ పులి బండ్ల చిట్టిబాబు, సోషల్ మీడియా కోఆర్డినేటర్ షేక్ జహంగీర్, కాంగ్రెస్ పార్టీ నాయకులు నిడమనూరు వంశీకృష్ణ, పత్తేపరపు సంగయ్య,పట్టణ ఐఎన్టీయూసీ అధ్యక్షుడు షేక్ బాజీ, పట్టణ బీసీ సెల్ అధ్యక్షుడు బిట్రా ఉద్దండయ్య, డివిజన్ కమిటీ అధ్యక్షులు తలుపుల వెంకటేశ్వర్లు, బొల్లెద్దు రాజేంద్ర, కోట నాగరాజు, మైలవరపు చక్రి, ఆదిమూలం శ్రీనివాసరావు, దూదేకుల జానీ తదితరులు పాల్గొన్నారు.

# పెండింగ్ డి.ఏ. లు, బకాయిలు చెల్లించాలి

**ఖమ్మం ఎడ్యుకేషన్, కెరటం న్యూస్ :** తెలంగాణ రాష్ట్రంలో ఉద్యోగ ఉపాధ్యాయులకు 4 విడతల కరువు భత్యమును రాష్ట్ర ప్రభుత్వం చెల్లించాల్సి ఉందని, వాటిని తక్షణం విడుదల చేయడంతో పాటు ఈ-కుబేరులో పెండింగ్లో ఉన్న బిల్లులను చెల్లించేందుకు, జిపిఎఫ్, టీఎస్ జిఎల్ఐ లోన్లు, పార్ట్ ఫైనల్స్ చెల్లించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని తెలంగాణ రాష్ట్ర ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ అధ్యక్షులు కే.జంగయ్య రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. నేడు ఖమ్మంలో సంఘం రాష్ట్ర నాయకులు షేక్ మహబూబ్ అలీ



అమ్మాయి వివాహ కార్యక్రమానికి హాజరైన సందర్భంగా కార్యకర్తల సమావేశంలో జంగయ్య మాట్లాడుతూ ఉపాధ్యాయుల బదిలీలు ప్రమోషన్లు చేయాలని నిర్ణయించడం పట్ల ప్రభుత్వానికి, విద్యాశాఖ అధికారులకు ఆయన కృతజ్ఞతలు తెలియజేశారు. అదేవిధంగా ప్రభుత్వ బడులలో అవసరమైన మౌలిక సౌకర్యాలు కల్పించడానికి, విద్యా వాలంటీర్లు, సర్వీస్ పర్సన్స్ ను నియమించడంతో పాటు, డీఎస్సీ ద్వారా ఉపాధ్యాయుల నియామక ప్రక్రియను సాధ్యమైనంత త్వరగా పూర్తి చేయాలని ఆయన రాష్ట్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. బడిబాటలో ఉపాధ్యాయులు పాల్గొని ప్రభుత్వ బడులను బలోపేతం చేయాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ ఉపాధ్యక్షులు చావ దుర్గభవాని, జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు జీవీ నాగమల్లేశ్వరరావు, పారుపల్లి నాగేశ్వరరావు, నాయకులు బుర్రి వెంకన్న, షేక్ యూసఫ్ సైదా, వల్లం కొండ రాంబాబు, వి.వి.రామారావు, పి.సురేష్, ఉద్దండు షరీఫ్ తదితరులు పాల్గొన్నారు.

## రామోజీ రావు మృతి పట్ల వడ్డెబోయిన సంతాపం



**ఖమ్మం టౌన్, కెరటం న్యూస్:** ప్రముఖ దినపత్రిక ఈనాడు, రామోజీ ఫిలిం సిటీ అధినేత చెరుకూరి రామోజీరావు అనారోగ్యంతో చికిత్స పొందుతూ మరణించడం పట్ల రాష్ట్ర ఓబీసీ సెల్ ఉపాధ్యక్షుడు కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు వడ్డెబోయిన నరసింహారావు, 25వ డివిజన్ కాంగ్రెస్ కమిటీ సంతాపాన్ని వెలిబుచ్చారు. ఈ సందర్భంగా వడ్డెబోయిన మాట్లాడుతూ చిరు వ్యాపారి అయినా రామోజీరావు ఈనాడు పత్రికతో మొదలై ఉదయం లేవగానే రామోజీరావు గుర్తు ఉండేటట్లు అహర్నిశలు ప్రియా పచ్చళ్ళు మార్గదర్శి చిట్ ఫండ్స్ అనేక సంస్థలలో నిరుద్యోగులకు బాసటగా నిలిచి వారు వాళ్ళ కాళ్ల మీద నిలబడేటట్లు కుటుంబ భారమైన ఈ రోజులలో అనేక మంది నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాలు కల్పించి బాసటగా నిలిచారు ఉద్యోగులలో వారిని నైపుణ్యాన్ని గుర్తించి ఎన్నో అవార్డులు ఇచ్చిన ఘనత వారికే దక్కింది అని అన్నారు మరియు సినిమా రంగంలో ఎంతోమంది యాంకర్స్ ను తయారు చేసి టీవీ సీరియల్స్ లలో ఎంతోమంది నటీనటులను తయారుచేసిన గొప్ప వ్యక్తి అని ఆయన సేవలను కొనియాడినారు అంతేకాకుండా తను జీవించి ఉండగానే సొంతంగా స్మారకం నిర్మించుకున్న ఏకైక వ్యక్తి రామోజీరావు 'మరణం ఒక వరం' 'నాకు చావు భయం లేదు' అని చెప్పి చూపించారు రామోజీ ఫిలిం సిటీ లో వారి స్మారకం కూడా ఉంది రామోజీరావు వాసత్వం కొనసాగేలా ఆయన చేసిన సేవలను భారతదేశం ఎప్పుడూ గుర్తుంచుకునే విధంగా ఉంటుందని అన్నారు. సంతాపం తెలిపిన వారిలో డివిజన్ అధ్యక్ష కార్యదర్శులు దాసరి పూర్ణ నాగిశెట్టి రాధాకృష్ణ ఖమ్మం నగర కాంగ్రెస్ నాయకులు బండారి శీను ఎం నాగభూషణం ఏరువ కృష్ణమూర్తి శ్రీనివాసరావు డివిజన్ కోశాధికారి రాకొండే కృష్ణ డివిజన్ పబ్లిసిటీ కన్వీనర్ అనిశెట్టి గిరి డివిజన్ మైనార్టీ నాయకులు ఎస్కే కాజా, ఎండి జానీ తదితరులు ఉన్నారు.

# ఆరోగ్యశ్రీలో అదనంగా 65 కొత్త చికిత్స విధానాలు అమలు

- **1375 పాత చికిత్స విధానాలకు నగదు ప్యాకేజీ పెంపు**
- **వీటికి గాను రూ. 487 కోట్లు విడుదల చేసిన డిప్యూటీ సీఎం భట్టి**

**హైదరాబాద్ బ్యూరో, కెరటం న్యూస్:** రాజీవ్ ఆరోగ్య శ్రీ పథకం కింద యాంజియోగ్రామ్, పార్కిన్ సన్, వెన్నుముక వంటి ఖరీదైన వ్యాధులకు చికిత్స, ప్రస్తుతం అమల్లో ఉన్న ఆరోగ్యశ్రీ పథకంలోని చికిత్సల ప్యాకేజీ ధరలు పెంచుతూ నిర్ణయం తీసుకున్నారు. వీటికి సంబంధించి రూ.497.29 కోట్లు అవసరం కాగా శనివారం ఈ నిధులను విడుదల చేస్తూ డిప్యూటీ సీఎం, ఆర్థిక శాఖ మంత్రి భట్టి విక్రమార్క ఆదేశాలు జారీ చేశారు. రాజీవ్ ఆరోగ్యశ్రీ పథకం కింద కొత్త చికిత్సా విధానాల కొరకు మరియు ప్రస్తుతము ఉన్న పథకాల ఆర్థిక సవరణ కొరకు మంత్రివర్యులు శ్రీ భట్టి విక్రమార్క మల్లుతో జూన్ 7న రాష్ట్ర సచివాలయం లో సమావేశము జరిగింది. అప్పటి కాంగ్రెస్



ప్రభుత్వము 2007 లో పేద ప్రజలకు నాణ్యమైన వైద్యము అందించేందుకు ఆరోగ్యశ్రీ పథకం ప్రవేశపెట్టారు. ఈ పథకం కింద 2.84 కోట్ల లబ్ధిదారులు ఉన్నారు. వీరికి 10 లక్షల వరకు ఆర్థిక సహాయం ఈ పథకం ద్వారా అందుతుంది. రాష్ట్రం లో ఈ సదుపాయము 1402 ఆసుపత్రుల ద్వారా అందించబడుతుంది. ప్రస్తుతము ఈ పథకం లో 1672 చికిత్సా విధానాలు అందుబాటులో వున్నాయి. ఇందులో 1375 విధానాలకు ప్యాకేజీ ధరలు పెంచాలని వైద్య నిపుణుల సూచనల మేరకు డిప్యూటీ సీఎం నిర్ణయం తీసుకున్నారు. ఇప్పటివరకు ఆరోగ్యశ్రీలో అమలులో లేని యాంజియోగ్రామ్, పార్కిన్ సన్, వెన్నుపూస కు సంబంధించిన 65 అధునాతన చికిత్స విధానాలను ఇకనుంచి ఆరోగ్యశ్రీలో అమలు చేయాలని నిర్ణయించారు. వీటికి తోడు ప్రస్తుతం ఆయుష్మాన్ భారత్ లో ఉన్న 98 చికిత్సా విధానాలు రాజు ఆరోగ్యశ్రీలో చేర్చడం వల్ల దాదాపు 189.83 కోట్ల ఖర్చు ప్రభుత్వం పై పడనుంది. అంతే కాక, 65 కొత్త చికిత్సా విధానాలు అంగీకరించడం వల్ల ప్రభుత్వ%శీ% 158.20 కోట్ల ఖర్చు చేయనుంది. పై సవరణల వల్ల, మరియు కొత్త చికిత్సా విధానాలు చేర్చడం కోసం, ప్రభుత్వం అదనంగా 497.29 కోట్లు ఈ సమావేశంలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు మంజూరు చేశారు.

# ఎస్.బి.ఐ.టి.లో ముగిసిన 5రోజుల పైథాన్ శిక్షణ



**ఖమ్మం ఎడ్యుకేషన్, కెరటం న్యూస్ :** ఈ దశాబ్దంలో పైతాన్ పై అవగాహన ఉన్నవారు రాణించగలరని యస్.బి.ఐ.టి. కళాశాల చైర్మన్ గుండాల కృష్ణ అభిప్రాయపడ్డారు. కళాశాలలో గత 5 రోజులుగా జరుగుతున్న శిక్షణా కార్యక్రమాలు ముగింపు వేడుకలకు ముఖ్య అతిధిగా హాజరైన కృష్ణ కంప్యూటర్ విద్య శాసిస్తున్న ఈ తరుణంలో పైతాన్ ప్రోగ్రామింగ్ అత్యంత కీలకం అని, పైతాన్ పై అవగాహన ఉన్నవారు అంతర్జాతీయ స్థాయిలో రాణించగలరని ఆయన తెలిపారు. ట్రైనింగ్స్ మరియు ప్రాంగణ నియామకాలకు ఎక్కవగా పైతాన్ , జావా వంటి కోర్సులపై అవగాహన తప్పనిసరి అని కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ డా బి. ధాత్రి తెలిపారు.



మొదటి సంవత్సరం విద్యార్థులకు గత 5 రోజులుగా పైతాన్ పై శిక్షణ నిస్తున్నట్లు, తద్వారా రానున్న ప్రాంగణ నియామకాలకు వారిని సిద్ధం చేస్తునట్లు వారు తెలిపారు. ఈ వార్షిక సంవత్సరంలో ఇప్పటికే 430 పై చిలుకు నియామకాలను తమ విద్యార్థులకు అందించినట్లు వారు తెలిపారు. ఆర్టిఫీషియల్ ఇంటిలిజెన్స్, మెషిన్ లెర్నింగ్ వంటి అత్యంత ఆదరన కలిగిన కోర్సులకు పైతాన్ ప్రోగ్రామింగ్ మూలమని కళాశాల ప్రిన్సిపల్ డా జి. రాజ్కుమార్ తెలిపారు. ఎన్నో అత్యాధునిక ఆవర్ణవాలకు పైతాన్ ప్రధాన అంశంగా ఉందని, ఈ కోర్సుల ద్వారా విద్యార్థులకు ప్రోగ్రామింగ్ స్కిల్స్తో పాటుగా పైతాన్ ప్రాజెక్టపై పూర్తి అవగాహన కలిగించినట్లు వారు తెలిపారు. ఈ సందర్భంగా శిక్షణను అందించిన కే. శేషసైన్ ని వారు అభినందించి. సత్కరించారు. ఈ కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపల్ డా కె. అమిత్ బింధాజ్, అకడమిక్ డైరెక్టర్స్, గంధం శ్రీనివాసరావు, డా ఎ.వి.వి. శివ ప్రసాద్, జి. ప్రవీణ్ కుమార్, డ జె. రవీంద్రబాబు, డాయన్. శ్రీనివాసరావు, విభాగ అదిపతి టి. గంగాధర్, టి.పి.ఒ. యన్. సవిత, కోఆర్డినేటర్ జి. ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ హాస్పిటల్ సమస్యలు పరిష్కారం చేయండి

- క్యాజువాలిటీలో డాక్టర్ సేవలు మెరుగుపరచాలి...
- డాక్టర్ పోస్టులు భర్తీ చేయండి....





**ఖమ్మం టౌన్, కెరటం న్యూస్ :** మూడు రాష్ట్రాల నుంచి ప్రతి రోజూ పేదలు వేలాది మంది పేషెంట్లు ఖమ్మం ప్రభుత్వ ఆసుపత్రిని నమ్ముకొని ఎంతో ఆశలతో వస్తున్నారని వారికి ధైర్యం ఇచ్చే విధంగా వైద్య సేవలు వుండాలని సీపీఎం పార్టీ నాయకులు కోరారు. శనివారం సీపీఎం పార్టీ ఖమ్మం టూ టౌన్ కమిటీ ఆధ్వర్యంలో హాస్పిటల్ సూపరింటెండెంట్ కిరణ్ తో భేటీ అయి పలు సమస్యలను ప్రతినిధి బృందం ఆయన దృష్టికి తీసుకెళ్లారు. ఈ సందర్భంగా పార్టీ జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు వై విక్రమ్ మాట్లాడుతూ అనేక ప్రధానమైన హెల్త్ విభాగాల్లో ఖాళీ పోస్టులు వున్నాయని ప్రధానంగా 50 డాక్టర్ పోస్ట్ లు ఖాళీగా వున్నాయని వెంటనే వాటిని భర్తీ చేసి రోగులకు వైద్య సేవలు పెంచాలని కోరారు. ప్రతి రోజూ ఉదయం నుంచి సాయంత్రం వరకు ఆసుపత్రి క్యాజువాలిటీలో సీనియర్ వైద్య సేవలు అవసరం వుంది అని, కానీ సీనియర్ డాక్టర్ లు కొద్ది టైం మాత్రమే వుండి ప్రయివేటు క్లీనిక్ లుకు వెళ్ళుతున్నారని తెలిపారు. వివిధ శాఖల్లో ల్యాబ్ టెక్నీషియన్లు, సిస్టర్ జాబ్ లు ఖాళీగా వున్నాయని వెంటనే వాటిని భర్తీ చేయాలి అని డిమాండ్ చేశారు. ప్రధానంగా లక్షలు రూపాయలు విలువ గల గుండె ఆపరేషన్ సేవలకు పర్మనెంట్ హార్ట్ డాక్టర్ ను నియమించాలి అని కోరారు. అలాగే 3 నెలలుగా పెండింగ్ లో ఉన్న కాంట్రాక్టర్ వర్కర్స్ కు జీతాలు వెంటనే చెల్లించాలని ఆయన డిమాండ్ చేశారు. ప్రభుత్వం ఆసుపత్రిలో రోగులకు మెరుగైన ఉచిత సేవలు కోసం రాబోయే కాలంలో సమస్యల పరిష్కారం కోసం దఫాలు వారిగా ఆందోళనలు పార్టీ ఆధ్వర్యంలో చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో పార్టీ టూ టౌన్ కార్యదర్శి బోడపట్ల సుదర్శన్, నాయకులు జె.వెంకన్న బాబు, భద్రం, నాగేశ్వరరావు, పి.వాసు, మల్లికార్జున్ రెడ్డి, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## ట్రైబల్ ఫోరం సదస్సును జయప్రదం చేయండి



**గుండాల, కెరటం న్యూస్ ప్రతినిధి:** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా సెంటర్లో జరుగు అఖిల భారత ట్రైబల్ ఫోరం సదస్సును జయప్రదం చేయాలని కోరుతూ గుండాల మండలం సెట్టిపల్లి గ్రామం లో అల్లూరి సీతారామరాజు సెంటర్లో పోస్టర్ ఆవిష్కరణ చేయడం జరిగింది ఈ కార్యక్రమం లో ఆదివాసీ నాయకులు బచ్చల సారయ్య, ఈర్ప భూమయ్య మాట్లాడుతూ.. దేశంలో బీజేపీ ప్రభుత్వం ఆదివాసీ ల పైన ఉక్కు పాదం మోపుతుందని, అడవులలోని ఖనిజ సంపద ను లాక్కోవడం కోసం అడవుల నుండి వెళ్లగొట్టే ప్రయత్నం చేస్తోందని ప్రశ్నించిన ఆదివాసీలపై అక్రమ కేసులు పెట్టి అడవుల నుండి దూరం చేసే విధంగా కేంద్ర ప్రభుత్వం చేస్తుందని వారు అన్నారు. ఆదివాసులకు కేటాయించిన పీసా చట్టాన్ని, 1/70 ఎక్ట్ ను రద్దు చేసే విధంగా మోడీ ప్రభుత్వం చేస్తుందని, ఆదివాసీలకు అండగా నిలబడతమని ఓట్లు వేసి గెలిచిన తర్వాత ఈ రోజుకు ఆదివాసీలకు అభివృద్ధి జరగడం లేదని కనీసం విద్య, వైద్యం కూడా పేదలకు అడించడం లో కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు విఫలంఅయ్యాయని ఈ తరుణం లో అఖిల భారత ట్రైబల్ ఫోరం సదస్సును నిర్వహించడం ఆదివాసీలను చైతన్యం చేయడమే అని అన్నారు. నేటికీ ఆదివాసీలపై కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు వారి యొక్క మనుగడ పైన ఫారెస్ట్ వారి నుండి దాడులు చెపిస్తూ అడవుల నుండి బయటకు నెట్టి వేసే విధంగా చేస్తున్నారని వారు అన్నారు విద్య, వైద్యం, ఉద్యోగ అవకాశాలలో కూడా భిన్నత్వం చూపిస్తున్నారు కొమరం భీమ్, భీర్సా ముండా, రాం జీ గోండు ఆదివాసీలను చైతన్యం చేయడం కోసం తమ ప్రాణాలను సైతం లెక్క చేయకుండా ఆదివాసీ మనుగడకై ఉద్యమించారు ఫలితంగా పీసా చట్టం 1/70, యాక్ట్ అమలు లోకి వచ్చింది వీటిని పూర్తిగా నిర్వీర్యం చేసే విధంగా మోడీ ప్రభుత్వం అనుసరిస్తుందని వీటికి వ్యతిరేకంగా ఆదివాసులు ఐక్యంగా ఉద్యమించాలని రేపు జరిగే ట్రైబల్ ఫోరం సదస్సుల్లో రాష్ట్ర నలుమూలల నుండి వచ్చి సదస్సును జయప్రదం చేయాలని వారు అన్నారు ఈ కార్యక్రమంలో ఈర్ప రాజేష్, కల్తీ మల్లయ్య, పెనకా సూర్యం, కల్తీ సురేష్, కల్తీ శ్రీను తదితరులు పాల్గొన్నారు.

# వాహనాల దొంగలను పట్టుకున్న వన్ టౌన్ పోలీసులు

- మూడు ఆటోలు, ఒక కారు మరియు ఒక ద్విచక్ర వాహనం స్వాదీనం



**కొత్తగూడెం, కెరటం న్యూస్ :** శనివారం ఉదయం కొత్తగూడెం బస్టాండ్ సెంటర్లో వాహన తనిఖీల నిర్వహణలో భాగంగా అన్ని వాహనాలను క్షుణ్ణంగా చెక్ చేస్తుండగా ఒక కారు అనుమానా స్పదంగా కనిపించడంతో అందులో ఉన్నవారిని అదుపులోకి తీసుకుని విచారించడం జరిగిందని సిఐ కరుణాకర్ తెలిపారు.కారులో ఉన్న ఏడుగురు వ్యక్తులను విచారించగా వీరు దొంగతనాలు చేస్తుంటారని తేలింది.ఈ ముఠాలో వి.ఎం బంజరు,పెనుబల్లికి చెందిన గోపి,శ్రీను అను వ్యక్తులు విద్యానగర్ కాలనీ,చుంచుపల్లిలో నివాసం ఉంటున్నారు.వి.ఎం బంజరకు చెందిన ముత్తారావు,శివరాం,కొటయ్య,గద్దల శివ, లక్మణ రావులతో ముఠాగా ఏర్పడి వరుస దొంగతనాలు చేస్తున్నట్లు తెలిపారు. భద్రాచలం, పాల్వంచ, కొత్తగూడెంలో ఇళ్ల ముందు ఉన్న ఆటోలను, బైకులను, %శ్రీ%కార్లను దొంగిలించి అమ్ముకుని వచ్చిన సొమ్మును అందరూ పంచుకునేవారు.ఇలా కొత్తగూడెంకు చెందిన ఒక ఆటోను అమ్మేందుకు వచ్చి పట్టుబడినట్లు తెలిపారు.వీళ్ళు అందరూ కార్లలో తిరుగుతూ దొంగతనాలు చేయడం అలవాటుగా చేసుకున్నారని అన్నారు.వీరందరినీ అరెస్ట్ చేసి రిమాండ్ నిమిత్తం కోర్ట్ నకు తరలించినట్లు సీఐ కరుణాకర్ తెలిపారు. పట్టుబడిన వీరివద్ద నుండి ఒక కారు,మూడు ఆటోలు,ఒక బైకును స్వాదీనం చేసుకోవడమైనదని వెల్లడించారు.